

మాతృభాష దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ సమావేశంలో సీఎం స్టాలిన్, మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్పీకర్ అప్పావు

ప్రపంచ తమిళులను ఏకం చేసే ఏకైక చిహ్నం 'తమిళ్'

ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్ని విభేదాలు అధిగమించి, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తమిళులను ఏకం చేసే ఏకైక చిహ్నం 'తమిళ్' అని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శాసనసభలో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, ఎమ్మెల్యేలతో స్పీకర్ అప్పావు మాతృభాషాభివృద్ధి కోసం పాటుపడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఎం తన ఎక్స్‌లో... "హీనస్థితిలో ఉన్న నిన్ను వదిలేస్తానా? తమిళుడు ఏరోజైనా తల వంచుకున్నాడా?' అంటూ పావేందర్ చెప్పినట్లు, మాతృభాష తమిళంను కాపాడుకొనే సంప్రదాయం నుంచి వచ్చినవాళ్లం మనం. ఇతర భాషల ఆధిపత్యం నుంచి తమిళాన్ని పునరుజ్జీవింపజేసి, నామకరణం, వేదిక ప్రసంగాలు, చలన చిత్రాల్లో మాటలు, ప్రభుత్వ పత్రాలు తదితరాలతో అన్నిరకాలుగా తమిళ వినియోగాన్ని పెంచి, మాతృభాషకు పూర్వవైభవం చేకూర్చిన చరిత్ర కలిగిన వాళ్లం. అలాంటి ఉద్యమ ఫలితమే మన ప్రభుత్వం తరపున ప్రపంచ మాతృభాషా దినోత్సవమైన ఈరోజు తమిళనాడు శాసనసభ్యులందరూ తమిళంను పరిరక్షించి పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేయడం" అంటూ సీఎం ట్వీట్ చేశారు.

టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా సెల్వపెరుందగై బాధ్యతల స్వీకారం

జాతీయ నేతల హాజరు ● కోలాహలంగా సత్యమూర్తి భవన్



బాధ్యతలు స్వీకరిస్తున్న సెల్వపెరుందగై

అడయార్, ఫిబ్రవరి 21: తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడిగా ఆ పార్టీ ఎమ్మెల్యే సెల్వపెరుందగై బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన పలువురు జాతీయ నేతలు పాల్గొన్నారు. ముఖ్యంగా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అజేయ్‌కుమార్, ఏఐసీసీ కార్యదర్శి సిరివెల్ల ప్రసాద్ సమక్షంలో సెల్వపెరుందగై బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నేత రాజేష్ కుమార్, మాజీ మంత్రి, సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పి.చిదంబరం, ఆయన తనయుడు కార్తీ చిదంబరం, ఎంపీలు డాక్టర్ చెల్లకుమార్, మాణిక్కం ఠాగూర్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు కేవీ తంగబాలు, ఈవీకేఎస్ ఇళంగోవన్, తిరునావుక్కరసు, కుమరి అనంతన్, ఎం.కృష్ణస్వామి పాల్గొన్నారు. అలాగే, ఏఐసీసీ మాజీ కార్యదర్శులు, మాజీ ఎంపీలు, కేంద్ర మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు తదితరులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా, టీఎన్‌సీసీ అధ్యక్షుడిగా ఉన్న కేఎస్ అళగిరిని తొలగించి ఆయన స్థానంలో సెల్వపెరుందగైను పార్టీ అధిష్ఠానం అధ్యక్షుడిగా ఎంపిక చేసిన విషయం తెల్సిందే. ముఖ్యంగా టీఎన్‌సీసీ అధ్యక్ష పదవిని దళిత నేతకు నాలుగు దశాబ్దాల తర్వాత అప్పగించింది. ఈ సందర్భంగా సెల్వ పెరుందగై మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పునర్వైభవం తీసుకురావడమే తన లక్ష్యమని ప్రకటించారు.

రంగు పీచు మిఠాయి విక్రయిస్తే రూ.2,000 జరిమానా

● చెన్నైలో నిఘా ముమ్మరం

పెరంబూర్, ఫిబ్రవరి 21: నగరంలో నిబంధనలు ఉల్లంఘించి రంగుల పీచు మిఠాయి విక్రయించే వారికి రూ.2,000 జరిమానా విధిస్తామని ఆహార భద్రతా శాఖ అధికారులు హెచ్చరించారు. మెరీనా బీచ్, రద్దీ ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఆరెంజ్ సహా వివిధ రంగుల పీచు మిఠాయిలో క్యాన్సర్ కారక రసాయనాలున్నట్లు పరిశోధనల్లో తేలింది. ముఖ్యంగా, రంగుల పీచు మిఠాయిలో 'రొడమైన్ బి' రసాయనం ఉండడంతో ఆ మిఠాయి విక్రయాలపై నిషేధం విధించిన రాష్ట్రప్రభుత్వం... తెలుపు రంగు పీచుమిఠాయి విక్రయాలకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ అధికారి సతీష్‌కుమార్ మాట్లాడుతూ... ఆరోగ్యానికి హాని కలిగించే రంగుల పీచు మిఠాయి విక్రయించే వారికి రూ.2 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాంటి రకం పీచు మిఠాయి విక్రయించే వారిని అదుపులోకి తీసుకొని, అది ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. కొందరు తమ ఇళ్లల్లోనే చిన్న యంత్రాల ద్వారా రంగుల పీచు మిఠాయి తయారు చేస్తున్నారని తెలిసిందన్నారు. అదే సమయంలో రంగులు లేని తెల్ల పీచు మిఠాయి విక్రయాలకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన తెలిపారు.



అలాగే శుభకార్యాల్లో రంగుల పీచు మిఠాయిలు వినియోగంపై ఆహార భద్రతా శాఖ అధికారులు నిషేధం విధించారు. పీచు మిఠాయిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఈ కారణంగా వివిధ రంగుల పీచు మిఠాయి విక్రయాలు తగ్గాయన్నారు. అలాగే, శుభకార్యాల్లో తెల్లటి పీచు మిఠాయి అందజేయవచ్చని, రంగు పీచు మిఠాయి మాత్రం వినియోగించరాదని అధికారులు తెలిపారు.



మెరీనా తీరంలో కరుణ స్మారకమందిరం సిద్ధం

26న ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

పెరంబూర్, ఫిబ్రవరి 21: దివంగత డీఎంకే మాజీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి స్థానిక మెరీనా తీరంలోని అన్నాదురై స్మారక మందిరం ప్రాంగణంలో 2.21 ఎకరాల్లో రూ.39 కోట్లతో నిర్మిస్తున్న స్మారక మందిరం సిద్ధమైంది. ఈ మందిరాన్ని ఈ నెల 26వ తేది ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారు. గత 2018 ఆగస్టు 7వ తేది డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి మృతిచెందిన తర్వాత, ఆయన కుమారుడు స్టాలిన్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. కరుణానిధి అంత్యక్రియలు నిర్వహించిన ప్రాంతంలో స్మారక మందిరం నిర్మిస్తామని స్టాలిన్ ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్టాలిన్... అసెంబ్లీ సమావేశాల్లో 110వ నిబంధన కింద మెరీనా తీరంలోని అన్నాదురై స్మారక ప్రాంగణంలో కరుణానిధి స్మారక మందిరం నిర్మించనున్నట్లు ప్రకటించారు. కరుణానిధి సినీ, రాజకీయ జీవిత విశేషాలతో కూడిన చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం స్మారక మందిరం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కళ, సాహిత్యం, రాజకీయ తదితర రంగాల్లో ఆయన పాత్రను గుర్తుచేసేలా 'ఉదయించే సూర్యుడు' ఆకారంలో కరుణ స్మారక మందిరంలో మూడు వలయాలు ఏర్పాటు చేశారు. అలాగే, ఓపెన్ ఆడిటోరియం, ఎగ్జిబిషన్ తదితరాలు చోటుచేసుకున్నాయి. కరుణ సమాధి వద్ద రాత్రి వేళ లేజర్ షో ఏర్పాటుచేశారు. ఈ స్మారక మందిరాన్ని గత ఏడాది ఆగస్టు 7వ తేది కరుణానిధి వర్ధంతి రోజున ప్రారంభించాలని నిర్ణయించగా, నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రారంభోత్సవం వాయిదా వేశారు. అలాగే, కరుణానిధి జయంతి రోజైన సెప్టెంబరు 15వ తేది ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో రెండవ సారి కూడా వాయిదా పడింది. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఈ స్మారక మందిరం ప్రారంభోత్సవ తేదీ ఖరారైంది.

200 వార్డుల్లో మహిళలకు వ్యాయామశాలలు

● 113 పీహెచ్‌సీలకు జనరేటర్లు ● కౌన్సిలర్లందరికీ ట్యాబ్‌లు
● వార్డు అభివృద్ధి నిధి రూ.45 లక్షలకు పెంపు
● కార్పొరేషన్ బడ్జెట్‌లో వెల్లడి ● కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన మేయర్ ప్రియ

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని 200 వార్డుల్లో మహిళల కోసం ప్రత్యేక వ్యాయామశాలల్ని నిర్మించనున్నట్లు మేయర్ ఆర్.ప్రియ ప్రకటించారు. అదే విధంగా నగరంలోని వైద్యశాలల్లో సేవలకు ఎలాంటి అవాంతరాయం కలుగకుండా 113 పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఆమె సారథ్యంలో కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో 2024-25 సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ఆమె ప్రవేశపెట్టారు. డిప్యూటీ మేయర్, కమిషనర్‌తో కలిసి ముందుగా సచివాలయానికి వెళ్లిన మేయర్.. సీఎంను కలుసుకుని ఆశీస్సులందుకున్నారు. అనంతరం రిప్పన్ భవన్‌కు వచ్చి బడ్జెట్‌ను దాఖలు చేశారు.

బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు...

చెన్నై నగరంలోని 200 వార్డుల్లో నివసించే ప్రజల కోరికలను నెరవేర్చే విధంగా మేయర్ ప్రత్యేక అభివృద్ధి నిధిని రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పెంచారు. కౌన్సిలర్ వార్డు అభివృద్ధి నిధిని రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షలకు పెంచారు. వార్డుల్లో పనుల సమీక్షను కాగితరహితం చేసేందుకు 200 మంది కౌన్సిలర్లకు రూ.కోటితో ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు. రెవెన్యూ శాఖలో వివిధ రకాల పన్నుల వసూలును క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానంలోకి మార్చాలని కార్పొరేషన్ నిర్ణయించింది.

రూ.4.33 కోట్లతో సుందరీకరణ...

చెన్నై కార్పొరేషన్ పరిధిలోని రహదారులకు ఇరుపైపులా సహా నగరంలోని పార్కుల్లో 2.50 లక్షల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకోనున్నారు.. బకింగ్‌హామ్ కాలువను ఆనుకునివున్న నావలర్ నగర్ - లాక్ నగర్, వాలాజా సాలై నుంచి భారతీ సాలై, బాలాండియమ్మన్ ఆలయ వీధి నుంచి సింగార వేలన్ వంతెన, కైలాసపురం వంతెన, ముండకన్నియమ్మన్ ఆలయ వంతెన, బ్యాంక్ రోడ్డు మైలాపూర్ వంతెన, మందవేలి వంతెన (రెండు వైపుల) ఉన్న పార్కులను రూ.4.33 కోట్లతో సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

రూ.10 కోట్లతో మహిళా జిమ్‌లు...

నగరంలోని 200 వార్డుల్లో మహిళలు వ్యాయామం చేసుకునేందుకువీలుగా రూ.10 కోట్లతో వ్యాయామశాలలు ఏర్పాటు చేయనున్నారు. చెన్నై నగరంలో ఉన్న ఎనిమిది ప్రధాన జలవనరుల సంరక్షణ కోసం రూ.10 కోట్లతో పనులు చేపట్టనున్నారు. మాత్తూరు ఎంఎండీఏ కాలనీలో కోనేరును అధునాతన టెక్నాలజీతో శుద్ధీకరించి, రూ.8 కోట్లతో స్పాంజ్ పార్క్ ఏర్పాటు చేయడంతో పాటు నగరంలోని కార్పొరేషన్ పార్కుల్లో స్పాంజ్ పార్కుల ఏర్పాటుకు అధ్యయనం చేయనున్నారు. కార్పొరేషన్ పరిధిలో 192 శ్మశానవాటికలు ఉండగా, వీటిని రూ.10 కోట్లతో ఆధునికీకరణ చేపట్టనున్నారు.



బడ్జెట్ ప్రతులను చూపుతున్న మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్

పశుసంవర్థక టీకా సెంటర్లు...

పిచ్చి కుక్క కాటుకు గురయ్యే వారికి టీకాలు వేసేందుకు వీలుగా మూడు జోన్లలో రూ.60 లక్షలతో పశుసంవర్థక టీకా సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. నగరంలో 4750 రహదారుల అభివృద్ధి కోసం రూ.404 కోట్లు కేటాయించనున్నారు. కార్పొరేషన్ పరిధిలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేసేందుకు వీలుగా రూ.1.50 కోట్లతో అధునాతన యంత్రం కొనుగోలు చేయనున్నారు. 113 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.5.09 కోట్లతో జనరేటర్ల కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కాగా 2024-25 ఏడాదికి మొత్తం రూ.4464.60 కోట్లు ఆదాయం సమకూరనున్నట్లు మేయర్ ప్రకటించారు. అదే విధంగా వ్యయం కాగా రూ.4727.12 కోట్లు కాగా, రూ.252.52 కోట్లు లోటుగా లెక్క తేల్చారు.

పాఠశాలల్లో సీసీ కెమెరాలు...

నగరంలోని 255 చెన్నై కార్పొరేషన్ పాఠశాలల్లో రూ.7.64 కోట్లతో ఒక్కో స్కూల్‌కు 4 కెమెరాల చొప్పున సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు. ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు చదువుకునే 64,022 మంది చిన్నారులకు జత షూ, రెండు జతల సాక్సులను ఉచితంగా అందించనున్నారు. చెన్నై స్కూళ్లలో విద్యాభ్యాసం చేసే 1.20 లక్షల మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. 11వ తరగతిలో చేరే 50 మంది విద్యార్థులను ఇస్రో, ముంబై బాబా అటామిక్ సెంటర్ తదితర ప్రాంతాలకు వైజ్ఞానిక టూర్‌కు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టనున్నారు.

పార్లమెంటు ఎన్నికల కోసం...

ఆశావహుల నుంచి అన్నాడీఎంకే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలనుకొనే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే బుధవారం ప్రారంభించింది. రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. కూటమి ఏర్పాటు, సీట్ల సర్దుబాటు, ఎన్నికల మేనిఫెస్టో తయారీ పనులను ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే చేపడుతున్నాయి. ఇప్పటికే బీజేపీతో తెగదెంపులు చేసుకున్న అన్నాడీఎంకే.. ప్రత్యేక కూటమి ఏర్పాటు చేసే దిశగా పావులు కదుపుతోంది. అన్నాడీఎంకేలో పలు పార్టీలు చేరేందుకు చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలోని 40 నియోజకవర్గాల్లో పోటీ చేయాలనుకొనే ఆశావహుల నుంచి దరఖాస్తు స్వీకరణను అన్నాడీఎంకే ప్రారంభించింది. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తుల పంపిణీ ప్రారంభమైంది. పోటీ చేయాలనుకొనే ఆశావహులు జనరల్ నియోజకవర్గానికి రూ.20,000, రిజర్వుడు నియోజకవర్గానికి రూ.15,000 రుసుముగా చెల్లించాల్సి ఉంది. నగదు స్వీకరించి రసీదుతో పాటు దరఖాస్తులను అందిస్తున్నారు. బుధవారం తొలిరోజు కావడంతో పలువురు ఆశావాహులు తమ మద్దతుదారులతో భారీగా తరలిరావడంతో కార్యాలయం, పరిసరాలు సందడిగా మారాయి. ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకుంటున్నారనే వివరాలను నిర్వాహకులు నమోదు చేశారు. ప్రస్తుతం శాసనసభ సమావేశాలు జరుగుతుండడంతో పార్టీ ఎమ్మెల్యేలందరూ అక్కడకు వెళ్లారు. దరఖాస్తులు మార్చి 1వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందజేయనున్నారు.



నగదు చెల్లించి దరఖాస్తులు పొందుతున్న ఆశావహులు

ఎన్నికల షెడ్యూల్ తర్వాతే పొత్తుల ఖరారు

● ఈపీఎస్



అడయార్, ఫిబ్రవరి 21: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాతే పొత్తులు ఖరారవుతాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) స్పష్టం చేశారు. అలాగే, అధికార డీఎంకే నుంచి కొన్ని పార్టీలు వైదొలుగుతాయని ఆయన చెప్పుకొచ్చారు. బుధవారం మదురైలో జరిగిన అన్నాడీఎంకే నేత వివాహ వేడుకలో పాల్గొన్న ఈపీఎస్ మాట్లాడుతూ... రాష్ట్రంలో గత మూడేళ్లుగా డీఎంకే పాలన సాగుతోందని ఈ పాలనలో మదురై ఒక్క అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదన్నారు. మదురై నెల్‌పేట నుంచి అవనియాపురం వరకు ఫ్లైవర్ నిర్మించనున్నట్టు ప్రకటించి, ఒక్కపైసా కూడా విడుదల చేయకపోవడంతో ఈ వంతెన నిర్మాణం ఆగిపోయిందన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రూ.1296 కోట్ల తో ముల్లై - పెరియారు ఉమ్మడి తాగునీటి పథకాన్ని ప్రకటించామని దాన్ని డీఎంకే ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందన్నారు. అలాగే, విరుదునగర్‌లో టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తామని బడ్జెట్‌లో ప్రకటించారని, నిజానికి ఈ పార్కును కూడా గత తమ ప్రభుత్వంలో ప్రకటించామన్నారు. అన్నాడీఎంకే పాలనలో ప్రకటించిన అనేక పథకాలకు మళ్లీ కొత్త స్టిక్కర్ అంటించి ప్రకటించారని తెలిపారు. ఇదేవిధంగా అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రకటించిన అనేక పథకాలను ఈ వార్షిక బడ్జెట్‌లో కొత్తగా ప్రకటించారని విమర్శించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, షెడ్యూల్ వెల్లడైన తర్వాత పొత్తులు ఖరారవుతున్నాయన్నారు. ప్రస్తుతం అక్కడ, ఇక్కడ చర్చలు జరుగుతున్నాయన్నారు. షెడ్యూల్ వెలువడిన తర్వాత తమ పార్టీ సారథ్యంలో బలమైన కూటమి ఏర్పడుతుందన్నారు. వేచి చూడండి... డీఎంకే కూటమిలోని కొన్ని పార్టీలు బయటకు వస్తాయ న్నారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 75 స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. ఈ లెక్కల ప్రకారం లోక్‌సభ ఎన్నికల్లో ఏడు సీట్లలో తమ పార్టీ గెలుచుకుంటుందన్నారు. నామక్కల్, కళ్ళకుర్చి, చిదంబరం వంటి కొన్ని నియోజకవర్గాల్లో అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయామని గుర్తుచేశారు. కేంద్ర ఎన్నికల సంఘంతో పాటు సుప్రీంకోర్టులు తమ పార్టీకి కేటాయించిన రెండాకుల చిహ్నాన్ని ఏ ఒక్కరూ స్తంభింపజేయలేరన్నారు. చిహ్నాన్ని స్తంభింపజేయాలని భావించే వారికి అది ఒక పగటి కలగానే మిగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు.

సమాచార దృశ్యిని

3న పల్స్ పోలియో

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో ఐదేళ్లలోపున్న 57.83 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కల మందు వేసే శిబిరం మార్చి 4వ తేది జరగనుంది. దేశ వ్యాప్తంగా ఈ శిబిరాలు నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. యేటా రెండు విడతలుగా పోలియో చుక్కల మందు వేస్తుండగా, ప్రస్తుతం పోలియో ప్రభావం తగ్గడంతో కొన్నేళ్లుగా ఒక విడత మాత్రమే చుక్కల మందు వేస్తున్నారు. రాష్ట్రంలో 43,051 శిబిరాల్లో 2 లక్షల మంది సిబ్బంది పిల్లలకు చుక్కల మందు వేయనున్నారు. అలాగే, 3 వేల మొబైల్ వాహనాలు వినియోగించనున్నారు. పల్స్ పోలియో శిబిరాల కోసం రాష్ట్రప్రభుత్వం వద్ద 89.24 లక్షల డోస్ చుక్కల మందు ఉన్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

ఉలేమాల బోర్డుకు సభ్యుల నియామకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: ఉలేమాలు, ఉద్యోగుల సంక్షేమ బోర్డుకు 15 మంది సభ్యులు నియమితులయ్యారు. సభ్యుల పదవీకాలం మూడేళ్లు కాగా, ఈ గడువు ఇటీవల ముగిసింది. ప్రస్తుతం బోర్డు అధ్యక్షుడిగా మంత్రి సెంజి మస్తాన్, సభ్యులుగా 15 మందిని నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి రీటా హరీష్ టక్కర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దుకాణాల్లో నైదల్ ఉప్పు విక్రయాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: రాష్ట్రప్రభుత్వ నెయిదల్ ఉప్పు విక్రయాలు దుకాణాల్లో ప్రారంభమయ్యాయి. రామనాథపురం జిల్లా వాలినోక్కం ప్రాంతంలో ప్రభుత్వ ఉప్పు తయారీ సంస్థ పనిచేస్తోంది. ఈ సంస్థ రేషన్ దుకాణాల్లో 'అరసు' పేరుతో అయొడైజ్డ్ కల్లుప్పు, పొడి ఉప్పు విక్రయిస్తోంది. ఇవి మినహా కర్మాగారాలకు కూడా సరఫరా చేస్తోంది. ఈ నేపథ్యంలో, నెయిదల్ పేరుతో కిలో ఉప్పు రూ.16, పొడి ఉప్పు రూ.18కి దుకాణాల్లో విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వినియోగ వస్తువుల వాణిజ్య సంస్థ సహా సహకార శాఖ దుకాణాల్లో ఈ విక్రయాలు ప్రారంభమయ్యాయి.

మత్స్యశాఖలో తాత్కాలిక ఉద్యోగాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: ప్రధానమంత్రి మత్స్య అభివృద్ధి పథకం కింద స్థానిక కొట్టివాక్కంలో ఖాళీగా ఉన్న తాత్కాలిక ఉద్యోగుల పోస్టులను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయనున్నారు. దరఖాస్తుదారులు చెన్నైకి చెందిన వారై మత్స్య గ్రామం, చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసించే వారై ఉండాలి. వయో పరిమితి 35 ఏళ్లు. ఔత్సాహికులు ఈ నెల 29వ తేదిలోపు నీలాంగరైలో ఉన్న జాలర్ల సంక్షేమ శాఖ సహాయ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు నెం.9840156196లో సంప్రదించవచ్చు.

ప్లాస్టిక్‌రహిత ప్రాంగణాలకు రూ.10 లక్షల బహుమతి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: ప్లాస్టిక్ లేని ప్రాంగణాలకు రూ.10 లక్షలు బహుమతి అందజేయనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా వినియోగించకుండా ఉండే తలా మూడు పాఠశాలలు, కళాశాలలు, వాణిజ్య కాంప్లెక్సులకు బహుమతి అందిస్తామన్నారు. మొదటి బహుమతిగా రూ.10 లక్షలు, రెండో బహుమతిగా రూ.5 లక్షలు, మూడో బహుమతిగా రూ.3 లక్షలు అందిస్తామన్నారు. HTTPS://CHENNAI.NIC.IN/ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తి చేసి, మే 1వ తేదిలోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు.

టాన్సెట్, సీటా హాల్ టిక్కెట్లు విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: టాన్సెట్, సీటా ప్రవేశ పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదలయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు టాన్సెట్, ఎంఈ, ఎంటెక్, ఎంఆర్క్, ఎంప్లాన్ పీజీ కోర్సుల్లో చేరేందుకు సీటా ప్రవేశపరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఇటీవల ఈ పరీక్షలకు దరఖాస్తు స్వీకరణ ముగిసింది. టాన్సెట్‌కు 34,020 మంది, సీటాకు 5281 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షల హాల్‌టిక్కెట్లు https://tancet.annauniv.edu/tancet లో విడుదలయ్యాయి. టాన్సెట్ మార్చి 9వ తేది ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగాను, 10వ తేది సీటా రాష్ట్రవ్యాప్తంగా 15 నగరాల్లో 40 పరీక్షా కేంద్రాల్లో జరగనున్నాయి.

గ్రూప్-2 ర్యాంకుల జాబితా విడుదల

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: గ్రూప్-2 ఇంటర్వ్యూ పరీక్ష మార్కులు, ర్యాంకుల జాబితాను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. ఈ వివరాలు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, తపాలా ద్వారా పంపించమని అధికారులు తెలిపారు.

రేపు వడివుడయమ్మన్ తిరుకల్యాణం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: స్థానిక తిరువొత్తియూర్ త్యాగరాజ సమేత వడివుడయమ్మన్ తిరుకల్యాణోత్సవం శుక్రవారం జరగనుంది. 2,000 వేల ఏళ్లనాటి ఈ ఆలయ మాసి బ్రహ్మోత్సవాలు ఈనెల 15వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవ దినాల్లో సూర్య ప్రభ, చంద్ర ప్రభ, నాగ, భూత, సింహ, వృషభ వాహనాల్లో ఉత్సవ మూర్తులు విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. ఈనెల 21న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు రథోత్సవం ఘనంగా జరిగింది. 23వ తేది తిరుకల్యాణోత్సవం, 24న ధ్వజావరోహణం, 25న త్యాగరాజస్వామి బందం పరి ఉత్సవం జరగనున్నాయి.

నేటినుంచి యథావిధిగా పళని రోప్‌కార్ సేవలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: పళని ఆలయ రోప్‌కార్ సేవలు ఈనెల 22న గురువారం నుంచి యథావిధిగా జరగనున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రోప్‌కార్ కేంద్రంలో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. ఈ పనులు మంగళవారంతో ముగియడంతో గురువారం నుంచి సేవలు ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వారాంతపు సెలవుల్లో 840 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 21: పౌర్ణమి, వారాంతపు సెలవుల సందర్భంగా పలు నగరాల నుంచి 840 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. స్థానిక వండలూరు కీలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి ఈనెల 23వ తేది 730 బస్సులు, 24వ తేది 640 బస్సులు నడుపుతున్నామని తెలిపింది. అలాగే, తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, కన్నియాకుమారి, కోయంబత్తూర్ నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి నాగపట్టినం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు నగరాలకు 23వ తేది 80 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

3న 'శివరాత్రి సంగీత మహోత్సవం'

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 3వ తేదీన 'వేణుగాన సమ్మోహనం' పేరుతో 'శివరాత్రి సంగీత మహోత్సవం' జరుగనుంది. మ్యూజిక్ అకాడమీలో సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

'స్టెరిలైట్'ను అనుమతించం : సుప్రీంకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 21: తూత్తుకుడిలో వివాదాస్పదమైన స్టెరిలైట్ కాపర్ కర్మాగారాన్ని వెంటనే ప్రారంభించేందుకు అనుమతించబోమని సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. స్టెరిలైట్ కర్మాగారం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందంటూ వివిధ సంస్థలు భారీస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. ఈ కర్మాగారానికి వ్యతిరేకత తారస్థాయికి చేరుకున్న నేపథ్యంలో, గత 2018 మే 22న పోలీసులు జరిపిన కాల్పుల్లో 13 మంది మృతిచెందగా, 40 మందికి గాయాలయ్యాయి. దీంతో, ఆ కర్మాగారాన్ని మూసివేయాలంటూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా వేదాంత సంస్థ తరపున సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ ఈనెల 14న విచారణకు రాగా, రాష్ట్రప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాదులు వాదించారు. స్టెరిలైట్ కర్మాగారం యజమాన్యం ప్రభుత్వ, న్యాయస్థానాల ఉత్తర్వులు అమలుపరచకుండా యధేచ్ఛగా వ్యవహరిస్తోందని, ఉల్లంఘనకు సంబంధించి ఈ కర్మాగారానికి గతంలో రూ.100 కోట్ల జరిమానా కూడా విధించినట్లు కోర్టుకు వివరించారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఈ పిటిషన్ మళ్లీ విచారణకు రాగా వేదాంత సంస్థ తరపున హాజరైన న్యాయవాదులు... నిపుణుల కమిటీ త్వరగా ఏర్పాటుచేసి, నెలరోజుల్లోపు నివేదిక సమర్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని వాదించారు. ఇరుతరఫు వాదనల అనంతరం స్టెరిలైట్ కార్మాగారాన్ని వెంటనే ప్రారంభించేందుకు అనుమతించేది లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సంస్కృత భాషా పటుత్వం - ద్రావిడ భాషల సారళ్యం'

ఈ రెండింటి మేలు కలయికతో రూపొందిన విశిష్ట భాష తెలుగు ● డాక్టర్ కాసల నాగభూషణం



డాక్టర్ నాగభూషణం

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'సంస్కృత భాషా పటుత్వం - ద్రావిడ భాషల సారళ్యం' మేలు కలయికతో రూపొందిన విశిష్ట భాష తెలుగు అని ప్రముఖ రచయిత, కవి డాక్టర్ కాసల నాగభూషణం పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తేనాంపేటలోని 'సాహిత్య అకాడమీ'లో బుధవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ కాసల నాగభూషణం మాట్లాడుతూ.. తన ప్రయత్నం లేకపోయినా తల్లి కడుపున ఉన్నప్పట్నుంచి బిడ్డకి అత్యంత సహజంగా అందివచ్చే భాష మాతృభాష అని పేర్కొన్నారు. అచ్చులతో అంతమయ్యే పదాలుండడం వల్ల సంగీతానికి ఎంతో అనుకూలమైన భాష తెలుగు అని, అందువల్లనే తమిళులు సైతం తెలుగుభాషను నేర్చుకుని మరీ త్యాగరాజు కీర్తనల్ని ఆలపిస్తారన్నారు. 'దేశభాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణ దేవరాయలు, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని విదేశీ పండితుడు నికోలా కాంటే, 'ఎంతో గొప్ప తపస్సు చేస్తే తప్ప తెలుగు భాష లభించదని' సంస్కృత పండితులు అప్పయ దీక్షితులు, 'సుందర తెలుంగు' అని తమిళ మహాకవి భారతియార్ తెలుగు భాషను ప్రశంసించారని గుర్తు చేశారు. భాష గొప్పతనం గురించి చెబుతూ.. ఒక భాషని నేర్చుకుంటే ఆ ప్రాంతాన్ని జయించినట్లేనన్నారు. ఎన్ని భాషలు నేర్చుకుంటే ప్రపంచం అంత విశాలమవుతుందన్నారు. మాతృభాష ఒక భవనానికి ప్రధాన ద్వారం లాంటిదని, లోపలున్న ఇతర భాషల్ని, ఆ విశేషాలని తెలుసుకోవాలంటే ముందు మనం మన మాతృభాషని క్షుణ్ణంగా నేర్చుకోవాలని హితవు పలికారు. భిన్నత్వంలో ఏకత్వం, వివిధ ప్రాంతాల ప్రజల మధ్య సామరస్యం భాషల ద్వారానే సాధ్యమని డాక్టర్ కాసల పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సాహిత్య అకాడమీ తమిళ్ అడ్వైజరీ బోర్డు సభ్యుడు వై.మణికంఠన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కన్నడ, మలయాళ భాషలకు చెందిన పండితులు కూడా హాజరయ్యారు.

ఆటోమేటిక్ రెయిన్‌గేజీ ఏర్పాటు



చెంగల్పట్టు తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెయిన్ గేజీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: చెంగల్పట్టు జిల్లాలో 30 ఆటోమేటిక్ రెయిన్‌గేజీలు ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షపాతం, వాతావరణ స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకొనేలా రాష్ట్రవ్యాప్తంగా 1,400 రెయిన్ గేజీలు, 100 వాతావరణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. చెంగల్పట్టు జిల్లాలోని అన్ని తాలూకా కార్యాలయ ప్రాంగణాలు, ప్రభుత్వ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఆ ప్రకారం, ఈ జిల్లాలోని తిరుకళుకుండ్రం, తిరుపోరూర్, సెయ్యూర్, మదురాంతకం, చెంగల్పట్టు, వండలూరు, తాంబరం, పల్లావరం ప్రాంతాల్లో ఈ పరికరాల ఏర్పాట్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ తెలిపారు.

'మెట్రో' టెండర్ల ఆహ్వానం

అడయార్, ఫిబ్రవరి 21: స్థానిక కోయంబేడు నుంచి నగర శివారు ప్రాంతమైన ఆవడి వరకు మెట్రోరైల్ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యాసాధ్యాలపై డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) తయారీ కోసం చెన్నై మెట్రో రైల్ టెండర్లను ఆహ్వానించింది. చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు విస్తరణ రెండో దశలో భాగంగా, కోయంబేడు నుంచి తిరుమంగళం, ముగప్పేరు మీదుగా ఆవడి వరకు మొత్తం 16.07 కిలోమీటర్ల మేరకు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేందుకు వీలుగా ఈ డీపీఆర్‌ను తయారు చేయనుంది. ఈ రెండో దశలో కోయంబేడు - ఆవడి, సిరుచ్చేరి - కిలాంబాక్కం, పూందమల్లి - పరందూరు వరకు మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. వీటిలో తొలుత కోయంబేడు - ఆవడి మార్గం డీపీఆర్ తయారీ కోసం టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 119 కిలోమీటర్ల దూరం మేరకు చేపట్టనున్న ఈ రెండో దశ మెట్రోమార్గం నిర్మాణ పనులు 2028 నాటికి పూర్తికానున్నాయి.

విరాళాలు ఇవ్వకున్నా... తక్కువిచ్చినా సోదాలు

● బీజేపీ తీరుపై సీపీఎం ఎంపీ విమర్శ

పెరంబూర్, ఫిబ్రవరి 21: పార్టీకి విరాళాలు ఇవ్వకున్నా, తక్కువ ఇచ్చినా వారిపై సోదాలను బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన తన 'ఎక్స్'లో... బీజేపీ తన ఖజానా పెట్టెను ఎలా నింపుకోవాలి అన్న దానిపై దృష్టి సారించిందన్నారు. ఒకవేళ వ్యక్తులైనా, సంస్థలైనా ఆ పార్టీకి విరాళాలు అందించకున్నా, ఒకవేళ తక్కువిచ్చినా వారిపై సోదాలు జరగడం సర్వసాధారణమైందన్నారు. ఇలాంటి చర్యలతో పార్టీ ఖజానాను నింపుకోవాలని బీజేపీ ఎత్తుగడలు చేస్తోందని ఎంపీ వెంకటేశన్ విమర్శించారు.

రాజగోపుర నిర్మాణం చేపడుతాం

● మంత్రి శేఖర్‌బాబు

అడయార్, ఫిబ్రవరి 21: మేట్టూరు మున్సిపాలిటీ పరిధిలోని మీనాక్షి చొక్కనాథర్ ఆలయ రాజగోపుర నిర్మాణం చేపడుతామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా, బుధవారం సభలో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. మెట్టూరులోని మీనాక్షి చొక్కనాథన్, జ్ఞానదండాయుధపాణి ఆలయాల్లో 30 యేళ్ల క్రితం కుంభాభిషేకం జరిగిందన్నారు. ఈ ఆలయాల్లో రూ.60 లక్షలతో జీర్ణోద్ధారణ పనులు చేపడుతామన్నారు. అలాగే, మీనాక్షి చొక్కనాథర్ ఆలయ రాజగోపురాన్ని కూడా నిర్మిస్తామని మంత్రి శేఖర్‌బాబు వెల్లడించారు.

రేపు తిరుచ్చెందూరు ఆలయ రథోత్సవం

అడయార్, ఫిబ్రవరి 21: తిరుచ్చెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ మాసి మాస వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలు ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన విషయం తెల్సిందే. 8వ రోజైన బుధవారం మూలవిరాట్టు షణ్ముగనాథర్ పచ్చశక్తి అలంకారంలో మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. 10వ రోజు వేడుకల్లో భాగంగా, ఈ నెల 23వ తేదీ శుక్రవారం వినాయకుడు, మూలవిరాట్టు, అమ్మవారులు వేర్వేరు రథాల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

సైకిల్ గుర్తు కేటాయించాలి

● హైకోర్టులో జీకే వాసన్ పిటిషన్

అడయార్, ఫిబ్రవరి 21: తమ పార్టీకి సైకిల్ గుర్తును కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కోసం మరో నాలుగు వారాల సమయం మాత్రమే ఉందని అందువల్ల తమ పార్టీకి సైకిల్ గుర్తు కేటాయించేలా ఈసీని ఆదేశించాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా, గత 1996లో జీకే వాసన్ తండ్రి జీకే మూపనార్ తమిళ్ మానిల కాంగ్రెస్(టీఎంసీ)ని స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఆయనకు ఎన్నికల సంఘం సైకిల్ గుర్తును కేటాయించింది. తన తండ్రి మరణాంతరం జీకే వాసన్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఆ తర్వాత ఆయన ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి మళ్లీ టీఎంసీని స్థాపించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సైకిల్ గుర్తు కేటాయించాలని కోరారు. ఇదే విషయంపై ఆయన సీఈసీకి ఈ నెల 6న విన్నపాన్ని కూడా సమర్పించారు. కానీ, సీఈసీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందుకే ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను బుధవారం విచారించిన హైకోర్టు న్యాయమూర్తులు ఆర్.మహాదేవన్, మహమ్మద్ షఫీక్‌లతోకూడిన ధర్మాసనం, అఫిడవిట్ దాఖలుచేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసి, తదుపరి విచారణ శుక్రవారానికి వాయిదా వేశారు.

రోడ్డెక్కిన అంధ విద్యార్థుల అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 21: రాజధాని నగరం చెన్నైలో బుధవారం ఉదయం బేసిన్ బ్రిడ్జి ప్రాంతంలో హక్కుల కోసం రాస్తారోకోలో పాల్గొన్న 50 మంది అంధ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గత పదిరోజులుగా అంధ విద్యార్థులు, పట్టభద్రుల సంఘానికి చెందిన సభ్యులు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ధర్నా, రాస్తారోకో, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి తదితర నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. టీచర్ అర్హత పరీక్షలకు అంధ పట్టభద్రులకు మినహాయింపు, ఐటీ విద్య నుంచి పీజీ డిగ్రీ వరకు అన్ని విద్యార్హత సర్టిఫికెట్లకు ఫీజు, పరీక్ష ఫీజు, విశ్వవిద్యాలయాల ఫీజులకు రాయితీ కల్పించేలా జీవో, నిరుద్యోగులకు నెలకు రూ.5,000 ఆర్థిక సాయం అందజేయాలి తదితర 9 డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రూ.6 కోట్ల నష్టపరిహారం కోరుతూ నోటీసు

● మంత్రి మెయ్యనాథన్ వెల్లడి

అడయార్, ఫిబ్రవరి 21: స్థానిక ఎన్నూరులోని ప్రైవేటు ఎరువుల తయారీ కంపెనీ నుంచి విషపూరిత అమ్మోనియా వాయువు లీకేజీ వ్యవహారంలో రూ.6 కోట్ల నష్టపరిహారం కోరుతూ కంపెనీ యాజమాన్యానికి ప్రభుత్వం నోటీసు జారీ చేసిందని రాష్ట్ర పర్యావరణ శాఖామంత్రి సీవీ మెయ్యనాథన్ వెల్లడించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన సమావేశాల్లో విపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... ఈ ఫ్యాక్టరీ నుంచి అమ్మోనియా విషయ వాయువు లీకైనట్టు గుర్తించిన 20 నిమిషాల్లోనే నియంత్రించినట్టు తెలిపారు. ఈ లీకేజీకి సంబంధించి పర్యావరణ పరిరక్షణ చట్టం 1986, సెక్షన్ 5 ప్రకారం పర్యావరణ నష్టపరిహారంగా రూ.5,92,888 చెల్లించాలని కంపెనీకి ప్రభుత్వం నోటీసు జారీ చేసిందని సభలో వెల్లడించారు.

డీఎంఎస్ ప్రాంగణంలో నర్సుల ఆందోళన

అడయార్, ఫిబ్రవరి 21: తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరుతూ తేనాంపేటలోని డీఎంఎస్ ప్రాంగణంలో నర్సులు బుధవారం ఆందోళన చేపట్టారు. తమిళనాడు ఎంఆర్‌పీ నర్సుల అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సుమారు 150 మందికిపైగా కాంట్రాక్టు నర్సులు పాల్గొన్నారు. ఆ తర్వాత సంఘ ప్రధాన కార్యదర్శి విలేకరులతో మాట్లాడుతూ... మెడికల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎనిమిదేళ్ల క్రితం రూ.7500 నెలవారి వేతనంతో కొందరు నర్సులను ఎంపిక చేయగా, ఇపుడు రూ.18 వేలు చొప్పున వేతనం ఇస్తున్నారని తెలిపారు.

కాంచీపురం జిల్లాలో గ్యాస్ పైప్‌లైన్ పునరుద్ధరణ



చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లాకు చెందిన అధీకృత సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) సంస్థ 'ఏజీ అండ్ పీ ప్రథమ్' వల్లకోట్టై నుంచి ఏర్పాటు చేసిన సహజ వాయువు పైప్‌లైన్ ఇటీవల దెబ్బతినగా, దానికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు. ఈనెల 19న కాంపౌండ్ వాల్ పనుల కోసం వేరే సంస్థ జరిపిన తవ్వకాల సందర్భంగా ఈ పైప్‌లైన్ దెబ్బతినడంతో గ్యాస్ లీకైంది. దీంతో సంబంధిత అధికారుల అనుమతుల మేరకు సంస్థ నిర్వాహకులు మరమ్మతులు చేపట్టారు. నిజానికి సదరు సంస్థ గ్యాస్ పైప్‌లైన్ కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసింది. అదే విధంగా మార్కర్లు, హెచ్చరిక సంకేతాలు, అత్యవసర సమాచారబోర్డు తదితరాలు ఉన్నప్పటికీ కాంపౌండ్ వాల్ బిల్డింగ్ సంబంధిత పనులకు సంబంధించిన తవ్వకాలను ప్రారంభించే ముందు సంబంధిత సంస్థ తమను సంప్రదించలేదని, ఎట్టకేలకు తాము మరమ్మతులు చేపట్టి గ్యాస్ సరఫరాను పునరుద్ధరించామని ఏజీ అండ్ పీ ప్రథమ్ నిర్వాహకులు పేర్కొన్నారు.

పెరిగిపోతున్న బియ్యం ధరలు

అడయార్, ఫిబ్రవరి 21: చెన్నైలో గత నాలుగు నెలలుగా బియ్యం ధరలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. ఇప్పటికే కిలో బియ్యంపై 17 రూపాయలు పెరిగింది. ప్రస్తుతం నగరంలో హోల్‌సేల్ దుకాణాల్లో రూ.60గా విక్రయించే ఉప్పుడు బియ్యం కిలో ఇపుడు రూ.68గా పెంచారు. రూ.60కు విక్రయిస్తున్న బియ్యం ఇపుడు రూ.70గాను, బాస్మతి బియ్యం రూ.120గా విక్రయిస్తున్నారు. అన్ని రకాల బియ్యం ధరలపై రూ.10 నుంచి రూ.17 వరకు పెరిగింది. ముఖ్యంగా చిల్లర దుకాణాల్లో ఈ పెరుగుదల కనిపిస్తుంది. బియ్యం ధరలు పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లలో విక్రయించే ఇడ్లీ, దోశెల ధరలు కూడా పెంచేస్తున్నారు.

రేపటి నుంచి డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు చర్చలు

అడయార్, ఫిబ్రవరి 21: వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం డీఎంకే కూటమిలోని పార్టీలకు సీట్ల సర్దుబాటు అంశంపై రేపటి నుంచి మళ్లీ చర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ చర్చల్లో కూటమిలోని ఆయా పార్టీలకు కేటాయించే సీట్లను ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ సీట్ల సర్దుబాటు అంశంపై చర్చలు జరిపేందుకు సీనియర్ నేతలు టీ.ఆర్. బాలు సారథ్యంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఐ.పెరియస్వామి, మాజీ మంత్రి పొన్ముడి, ఎంపీ ఏ.రాజా, తిరుచ్చి శివ, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వ సభ్యులుగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం విదితమే.ఈ కమిటీ ఇప్పటికే కూటమి పార్టీలతో తొలి విడత చర్చలు జరిపింది కూడా. ఈ నేపథ్యంలో మలి విడత చర్చలు శుక్రవారం నుంచి మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించింది.

విమానాశ్రయంలో కొకైన్ స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న కొకైన్

పెరంబూర్, ఫిబ్రవరి 21: లావోస్ నుంచి సింగపూర్ మీదుగా అక్రమంగా తీసుకొచ్చిన 2.7 కిలోల కొకైన్‌ను స్థానిక విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పర్యాటక వీసాలో మాదకద్రవ్యాలు తీసుకొచ్చిన ఇండోనేసియాకు చెందిన ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న కొకైన్ విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.10 కోట్లు ఉంటుందని అధికారులు చెప్పారు.

అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యేపై అదనపు కట్న వేధింపుల ఫిర్యాదు



బాధితురాలు డాక్టర్ శృతిప్రియదర్శిని

పెరంబూర్, ఫిబ్రవరి 21: స్థానిక షోళింగనల్లూర్ అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే కేపీ కందన్‌పై ఆయన కోడలు ఆవడి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అదనపు కట్న ఫిర్యాదు అందజేశారు. ఆమె అందజేసిన ఫిర్యాదులో... వివాహ సమయంలో 1,000 సవర్లు అడిగారని, 2018లో వివాహం జరిగిన సమయంలో 600 సవర్ల నగలు, రూ.1.65 కోట్ల రెండు కార్లు, 20 కిలోల వెండి తదితరాలు తన తల్లిదండ్రులు అందజేశారని, ప్రస్తుతం 400 సవర్ల వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని పేర్కొన్నారు. కేపీ కందన్ కోడలు శృతిప్రియదర్శిని వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఈ విషయమై ఆమె తండ్రి మాట్లాడుతూ... కట్నం తీసుకురావాలంటూ తన కుమార్తెను కందన్ కుటుంబసభ్యులు శారీరకంగా హింసిస్తున్నారని, ఆడపిల్ల పుట్టిన తర్వాత 2021లో తన కుమార్తెను కందన్ కుటుంబసభ్యులు ఇంటి నుంచి వెళ్లగొట్టారని తెలిపారు. కుమార్తె కావడంతో నేరుగా వెళ్లి వారితో మాట్లాడగా, మరో 500 సవర్లు, రూ.10 కోట్లు అందించాలని కందన్ కోరాడని తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె మెడిసిన్ చదువుతున్న సమయంలో, సహచర మెడికోలతో తీసుకున్న ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యంగా చిత్రీకరించాలని పేర్కొన్నారు. కేపీ కందన్, ఆయన భార్య, కుమారుడు కేపీ సతీష్‌కుమార్, కుమార్తెపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

పెరగనున్న ఎండ తీవ్రత

పెరంబూర్, ఫిబ్రవరి 21: తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉంటాయని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది. ఈ మేరకు ఆ కేంద్రం డైరెక్టర్ సెందామరై కన్నన్ విడుదల చేసిన ప్రకటనలో... గత 24 గంటల్లో తమిళనాడు, పుదుచ్చేరిలలో పొడి వాతావరణం నెలకొనగా, వర్షం కురవలేదన్నారు. పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఈరోడ్‌లో 37 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రత నామక్కల్‌లో 17.5 డిగ్రీలు నమోదైందన్నారు. చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ తెల్లవారుజామున మంచు కురుస్తుందని, పగటి ఉష్ణోగ్రతలు 32-33 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 22-23 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

33 తాబేళ్లు స్వాధీనం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 21: విల్లుపురం - పుదుచ్చేరి జాతీయ రహదారిలో మాంసం కోసం తరలిస్తున్న 33 తాబేళ్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మార్గంలో తాబేళ్లను తరలిస్తున్నట్లు అధికారులు సమాచారం అందడంతో, ఆ ప్రాంతంలో వాహనతనిఖీలు నిర్వహించారు. బైక్‌లో వచ్చిన ఓ యువకుడు భారీ పంజరంలో 33 తాబేళ్లు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆంధ్ర రాష్ట్రం గుంటూరు ప్రాంతానికి చెందిన ఆ యువకుడిని విచారించగా, మాంసం కోసం తరలిస్తున్నట్లు తెలిపాడు. యువకుడిని కోర్టులో హాజరు పరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అనుమతులు లేకుండా జెండా స్తంభం

● విజయ్ అభిమానులపై కేసు

పెరంబూర్, ఫిబ్రవరి 21: నటుడు విజయ్ తమిళగ వెట్రిక్కళగం పేరుతో రాజకీయ పార్టీ స్థాపించగా, రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ కార్యకర్తలు జెండా స్తంభాలు ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. కళ్లకుర్చి జిల్లా ఎలవనాసూరుకోటలో విజయ్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు మంగళవారం జెండా స్తంభం ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన జెండా స్తంభాన్ని తొలగించిన పోలీసులు, విజయ్ అభిమాన సంఘ నేతలు భరణిబాలాజి, మోహన్, పళనివేల్, ఆజాద్‌పై కేసు నమోదు చేశారు. అలాగే, తిరునల్లార్‌లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఆ పార్టీ జెండా స్తంభాన్ని పోలీసులు తొలగించడం ఉద్రిక్తతకు దారి తీసింది.

వండలూరు జూపార్కులో బెంగాల్ టైగర్ మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 21: స్థానిక వండలూరు జులాజికల్ పార్కులో అనారోగ్యంతో బాధపడుతున్న బెంగాల్ టైగర్ బుధవారం మృతి చెందిందని పార్కు అధికారులు తెలిపారు. ఈ పార్కులో సంరక్షిస్తున్న 21 ఏళ్ల వయస్సు కలిగిన విజయన్ అనే మగసింహం కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా పశువైద్యులు చికిత్సలందిస్తున్నారన్నారు. ఈ క్రమంలో, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిని తీవ్ర అస్వస్థతకు గురైన పులి బుధవారం మృతి చెందిందని అధికారులు తెలిపారు.

యువతి స్నానం చేస్తుండగా వీడియో

● కార్పొరేషన్ కాంట్రాక్టు సిబ్బంది అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 21: దోమల మందు పిచికారి చేస్తూ ఒక యువతి స్నానం చేస్తుండగా వీడియో తీసిన ఘటనలో చెన్నై కార్పొరేషన్‌కు చెందిన కాంట్రాక్టు ఉద్యోగిని రాయపురం పోలీసులు అరెస్టు చేశారు. రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన దినకరన్ (30) అనే వ్యక్తి రాయపురం జోన్ కార్యాలయంలో కాంట్రాక్ట్ సిబ్బందిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన మంగళవారం బహుళ అంతస్తు భవనంలో దోమల నిర్మూలన మందును పిచికారి చేస్తున్నాడు. ఆ సమయంలో ఒక యువతి స్నానం చేస్తుండటాన్ని చూసి, వీడియో తీశాడు. దీన్ని గమనించిన స్థానికులు అతన్ని పట్టుకుని వీడియోను పరిశీలించి పోలీసులకు అప్పగించగా, వారు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

చెన్నై తీరంలో 13 వేల తాబేలు గుడ్లు స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 21: చెన్నై సముద్రతీరంలో గత వారం రోజుల వ్యవధిలో 13 వేల తాబేలు గుడ్లను స్వాధీనం చేసుకున్నారు. యేటా డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు తాబేళ్ల పునరుత్పత్తికాలం. ఈ కాలంలో సముద్రం నుంచి తీరానికి వచ్చే తాబేళ్లు గుడ్లను పెడుతుంటాయి. వీటిని అటవీ శాఖ, తాబేళ్ల సంరక్షణ సంస్థకు చెందిన సిబ్బంది సేకరిస్తుంటారు. ఆ విధంగా గత వారం రోజుల్లో ఏకంగా 13 వేల గుడ్లను స్వాధీనం చేసుకున్నారు. గత 2019-20లో 32,244 గుడ్లను సేకరించగా, 2020-21లో 41,326 గుడ్లు, 2021-22లో 55,713 గుడ్లు, 2022-23లో 42,650 గుడ్లను స్వాధీనం చేసుకున్నారు.

సెంథిల్ బాలాజీ పిటిషన్‌పై తీర్పు వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 21: సెంథిల్ బాలాజి రెండో సారి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై తీర్పును తేది ప్రకటించకుండా న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ వాయిదా వేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేసి 8 నెలలుగా జైలులో ఉన్న సెంథిల్ బాలాజి బెయిలు కోరుతూ రెండో సారి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ ఈనెల 14వ తేది న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ విచారించగా సెంథిల్ బాలాజి తరపున, ఈడీ శాఖ డిజిటల్ దస్తావేజులు మార్చి వేసిందని పేర్కొన్నారు. అందుకు 15వ తేది ఈడీ బదులిస్తూ... డిజిటల్ దస్తావేజులు మార్చామని సెంథిల్ బాలాజి ఆరోపణలు అవాస్తమని, ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేసినా, పలుకుబడి మాత్రం తగ్గలేదని, బెయిలు మంజూరైతే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశముందని, అందువల్ల బెయిలు ఇవ్వరాదని వాదించింది. ఈ పిటిషన్ బుధవారం మళ్లీ విచారణకు రాగా, ఇరు తరపు వాదనలు ముగిసిన నేపథ్యంలో, తేది ప్రకటించకుండా న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ తీర్పు వాయిదా వేశారు.

ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్న తారాలోకం

అడయార్, ఫిబ్రవరి 21: లోక్‌సభ ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో అన్ని రాజకీయ పార్టీలు ప్రచార ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా ఓటర్లను ఆకర్షించేందుకు సినీ నటీనటులతో ప్రచారం చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అధికార డీఎంకే తరపున స్టార్ క్యాంపెయినర్లుగా వైగై చంద్రశేఖర్, వాసు విక్రమ్, బోస్ వెంకట్, ఆరంతాంగి నిషా, ఈరోడ్ మహేష్, అరక్కోణం దినేష్, సంధ్య, అన్నలక్ష్మి సహా పలువురు సినీ నటులు ప్రచారం చేయనున్నారు. అదేవిధంగా ప్రధాన విపక్షమైన అన్నాడీఎంకే తరపున ప్రధాన ప్రచారకర్తలుగా వింధ్య, గౌతమి, గాయత్రి రఘురాం, సింగముత్తు, నాంజిల్ పీసీ, అన్బళగన్, ఆర్‌వీ ఉదయకుమార్, అనుమోహన్ తదితరులు ఉన్నారు. వీరితోపాటు మరికొందరు హీరోలు, హీరోయిన్లు, ఇతర నటులు ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నారు. బీజేపీ తరపున సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ, హీరోయిన్ నమిత, రంజనా నాచ్చియార్, వెంకటేష్, బాబు గణేశ్, ఆర్తీ, విఘ్నేష్‌తో పాటు మరికొందరు సిద్ధంగా ఉన్నారు. అదేవిధంగా హీరో కమలహాసన్ పార్టీ ఎంఎన్ఎం, ఎండీఎంకే, డీఎండీకే, పీఎంకే, సమత్తువ మక్కల్ కట్చి, డీపీఐ, పీఎంకేల తరపున కూడా పలువురు సినీ నటులు ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. వీరంతా ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు.



విలేకరుల సమావేశంలో 'రణమ్ అరమ్ తవరేల్' చిత్రబృందం

విడుదలకు సిద్ధమైన 'రణమ్ అరమ్ తవరేల్'

వైభవ్, తాన్య హోప్, నందితా శ్వేత, సరస్ మేనన్, సురేష్ చక్రవర్తి తదితరులు నటించిన 'రణమ్ అరమ్ తవరేల్' చిత్రం ఈనెల 23వ తేదీ శుక్రవారం విడుదలకు సిద్ధమైంది. డెబ్యూ డైరెక్టర్ షెరీఫ్ దర్శకత్వం వహించగా మధునాగరాజన్ నిర్మించారు. అరోల్ కరోలి సంగీతం సమకూర్చిన ఈ చిత్రానికి కెమెరామెన్ బాలాజీ వ్యవహరించారు. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని ఆడియో, ట్రైలర్‌ను విడుదల చేశారు. చిత్ర హీరో వైభవ్ మాట్లాడుతూ... 'రణమ్ అరమ్ తవరేల్ చిత్రంలో మంచి సందేశం ఉంది. ఇది నా 25వ చిత్రం. కచ్చితంగా నా సినీ కెరీర్‌లో ఓ ముఖ్యమైన మూవీ. దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. ఇలాంటి జోనర్‌లో నేను ఇప్పటివరకు నటించలేదు. అగ్రహీరో విజయ్ నటిస్తున్న 'గోట్' చిత్రంలో నటిస్తున్నా. కానీ, ఆ స్టోరీ ఏంటో నాకు తెలియదు. కథ తెలుసుకోకుండానే నటిస్తున్నా. దర్శకుడు వెంకట్ ప్రభు ఎన్నడూ నాకు స్టోరీ వినిపించలేదు. నేను అడిగిన సందర్భాలు లేవు. అజిత్‌తో కలిసి నటించా. ఇపుడు విజయ్ చిత్రంలో నటిస్తున్నా' అని అన్నారు. దర్శకుడు షెరీఫ్ మాట్లాడుతూ... నిజం కోసం నిలబడడం. అన్యాయాన్ని వ్యతిరేకించడం కూడా ధర్మమే. దాన్ని ఆలోచించకుండా చేయ్యాలన్నదే ఈ మూవీ సందేశం' అన్నారు. ఈ సినిమాను శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీపై నిర్మాత శక్తివేలన్ విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత నిర్మాత మధునాగరాజన్, హీరోయిన్ తాన్య హోప్ తదితరులు ప్రసంగించారు.

వెండితెరపై ఎల్టీటీఈ ప్రభాకరన్ కుమారుడి బయోగ్రఫీ


'వీరత్తిన్ మగన్'లో ఓ దృశ్యం

ఎల్టీటీఈ చీఫ్ వేలుపిళ్ళై ప్రభాకరన్ కుమారుడు జీవిత చరిత్ర ఆధారంగా చేసుకుని తెరకెక్కిన సినిమా 'వీరత్తిన్ మగన్'. త్వరలోనే విడుదలకు సిద్ధమైంది. బిజు రవీంద్రన్ కథను సమకూర్చి దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే ఎస్ఎం రఫి, మాటలు శ్రీభారతి, బీజీఎం సానంద్ జార్జి, కెమెరా శ్రీజిత్ విజయ్, సంగీతం రాచి, నిర్మాతలు జోషి కందత్తిల్, అనిల్ అశ్వతి. ఈ కార్యక్రమంలో 15వ నార్వే అవార్డుల వివరాలను తాజాగా నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇందులో ప్రముఖ దర్శకుడు వీసీ గుహనాథన్, నిర్మాత కె.రాజన్, దర్శకుడు శీను రామస్వామి, నటులు రోబో శంకర్, బోస్ వెంకట్, స్టంట్ మాస్టర్ జాగ్వార్ తంగం, నిర్మాత విజయమురళితో పాటు నార్వే తమిళ చిత్రోత్సవాల డైరెక్టర్ వశీకరన్ శివలింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్వే తమిళ సినిమా 15వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ హాస్య నటుడు కేపీవై బాలాకు కెప్టెన్ విజయకాంత్ అవార్డును ప్రదానం చేశారు. హాస్య నటుడిగా ప్రేక్షకులను మెప్పిస్తూనే, అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు బాలాను ఈ అవార్డు కోసం ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. నటించడం, యాంకరింగ్ చేయడం వల్ల వచ్చే సంపాదనలో తనకు కావాల్సిన మొత్తాన్ని ఉంచుకుని, మిగిలిన సొమ్మును పేదలను ఆదుకునేలా వివిధ సేవా కార్యక్రమాలకు కేపీవై బాలా ఖర్చు చేస్తున్నారు. అందుకే కెప్టెన్ విజయకాంత్ అవార్డు కోసం ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. సీనియర్ దర్శకుడు వీసీ గుహనాథన్ మాట్లాడుతూ... 'చిన్న వయసులోనే బాలా సేవలు అద్భుతం. అందుకే ఆయనకు విజయకాంత్ అవార్డును అందించడం సముచితం. 'వీరత్తిన్ మగన్' సినిమా చాలా బాగా వచ్చింది. సెంటిమెంట్ అంశాలతో సినిమాను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. నేను 9 బాషల్లో 300కు పైగా చిత్రాలకు దర్శకత్వం వహించినప్పటికీ ఈ తరహాలో దర్శకత్వం చేయలేకపోయా' అని పేర్కొన్నారు.

మరుగున పడిన సత్యాన్ని తెరపై ఆవిష్కరించాం

- 'రజాకార్' నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి



'రజాకార్' చిత్ర ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

మన చరిత్రలో మరుగన పడిన ఒక సత్యాన్ని ఈ తరానికి తెలియజేయడం మన కర్తవ్యంగా భావించి 'రజాకార్' చిత్రాన్ని తెరకెక్కించినట్టు నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి అన్నారు. స్వీయ నిర్మాణంలో సమరవీర్ క్రియేషన్స్ బ్యానరుపై తెరకెక్కిన చిత్రం ఈ సినిమాకు యాటా సత్యనారాయణ దర్శకుడు. బాబీసింహా, వేదిక జంటగా నటించి, ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య పోరాట సమయంలో హైదరబాద్ నగరంలో జరిగిన ఒక యదార్థ, చరిత్రలో మరుగునపడిన పడిన ఘటనను ఆధారంగా చేసుకుని తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం బాషల్లో తెరకెక్కించారు. తమిళ ఆడియో, ట్రైలర్‌ను మంగళవారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఇందులో నిర్మాత నారాయణ రెడ్డి మాట్లాడుతూ... 'చరిత్రలో మరుగునపడిన కథను ఈ తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ సినిమాను రూపొందించాం. హైదరాబాద్ నగరాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి ముందు నిజాం ఈ ప్రాంతాన్ని తుర్కిస్తాన్‌గా మార్చారు. దాన్ని భారత ప్రభుత్వం అడ్డుకుంది. మా వంశంలో మా తాత పోరాడి ప్రజలను రక్షించిన కథ నేను విన్నాను. ఆ పోరాటంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌లోని ప్రజలపై జరిగిన ఉన్మాద చర్యలు, ఆ నగరం కోలుకున్న తీరును ఇందులో వివరించాం' అని పేర్కొన్నారు. హీరో బాబీసింహా మాట్లాడుతూ... 'నిర్మాత తలచుకుంటే భారీ కమర్షియల్ చిత్రాలను నిర్మించగలరు. కానీ, ఈ సినిమాను రూ.40 కోట్లతో తెరకెక్కించారు. ఇలాంటి సినిమాను తెరకెక్కించేందుకు ముందుకు వచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు' అన్నారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ... 'తమిళ భాష, మణిరత్నం అంటే నాకు ఎంతో ఇష్టం. ఈ కథను సుహాసినికి వివరించగా, ఎలాంటి సాయమైనా చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ పాత్ర కోసం తనను తాను మార్చుకున్న బాబీకి థ్యాంక్స్ 'రజాకార్' చిత్రం ద్వారా తమిళ చిత్రపరిశ్రమకు దర్శకుడిగా పరిచయమవుతున్న నన్ను తమిళ ప్రేక్షకులు, పరిశ్రమ ఆదరిస్తుందని నమ్ముతున్నా' అని పేర్కొన్నారు.


'నాథూరాం గాడ్సే'లో ఓ దృశ్యం

మహాత్మా గాంధీ మరణం వెనుక...

జాతిపిత మహాత్మా గాంధీ మరణం వెనుక ఉన్న వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'నాథూరామ్ గాడ్సే'. 'కిడుగు' ఫేం వీరమురుగన్ దర్శకత్వం వహించారు. రామలక్ష్మి ప్రొడక్షన్స్, ఈంజనాడు 18 పట్టి గణేష్ నాగా ప్రొడక్షన్స్, శివన్ ఓటీటీ సంయుక్తంగా నిర్మించాయి. శశి, రవి, తామరై, పీటర్ శరవణన్, ఇన్బా, శివకుమార్, వడివేల్ మహేష్ తదితరులు నటించారు. 'కిడుగు' చిత్రానికి సంగీతం సమకూర్చిన జెర్సన్ ఈ సినిమాకూ స్వరాలు అందిస్తుండగా, జేకే అండ్ బృందం ఛాయాగ్రహణం సమకూర్చుతున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలను దర్శకుడు వీరమురుగన్ అందించారు. ఈయన గతంలో తెరకెక్కించిన 'కిడుగు' చిత్రం అనేక విమర్శలతో పాటు ప్రశంసలు అందుకుంది. రాజకీయ నేతలను లక్ష్యంగా చేసుకుని తెరెక్కించగా, తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ సినిమాను విడుదలకాకుండా అడ్డుకున్నారు. దీంతో తామరై యూట్యూబ్ చానెల్‌లో రిలీజ్ చేశారు. ఇపుడు తెరకెక్కించిన 'నాథూరామ్ గాడ్సే' గురించి ఆయన మాట్లాడుతూ... 'గాంధీజీని గాడ్సే తుపాకీతో కాల్చి చంపేశారు. గాంధీ శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. కానీ, ఆయన శరీరం నుంచి వెలికి తీసింది నాలుగు బుల్లెట్లు. దీని వెనుక ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. మార్చి 7వ తేదీన శివన్ ఓటీటీ, పరమశివన్ ఓటీటీ, మరో కొత్త ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఐసీఎఫ్‌ను సందర్శించిన రైల్వేబోర్డు ఛైర్మన్


వందేభారత్ రైలు ఇంజిన్‌ను పరిశీలిస్తున్న జయవర్మ



చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వే బోర్డు ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జయవర్మ సిన్హా బుధవారం నగరంలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)ను తనిఖీ చేశారు. ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు ఆమెకు దగ్గరుండి ఐసీఎఫ్‌ను చూపించారు. ఇక్కడ తయారవుతున్న రైల్వే బోగీలు, వందే భారత్ రైళ్ల తదితరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అక్కడి పని తీరును, సిబ్బంది వివరాలను జయవర్మ అడిగి తెలుసుకున్నారు. దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయంలో రైల్వే బోర్డు ఛైర్మన్ మరియు సీఈవో జయవర్మ సిన్హా ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సదరన్ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్.ఎన్. సింగ్, ఏజీఎం కౌశల్ కిషోర్, దక్షిణ రైల్వే ప్రిన్సిపల్ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ హెడ్ బి.విశ్వనాథ్ ఈర్య సహా సేలం, మదురై, తిరుచిరాపల్లి, పాలక్కాడ్, తిరువనంతపురం డివిజనల్ రైల్వే మేనేజర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో ప్రముఖులు

ఘనంగా మాతృభాషా దినోత్సవం

- మద్రాస్ వర్సిటీ తెలుగుశాఖలో రౌండ్‌టేబుల్ సమావేశం

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్యార్థినులు ఆలపించిన 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ...' ప్రార్థనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగుతల్లి చిత్రపటానికి పుష్పాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య విస్తాలి మాట్లాడుతూ... రాష్ట్రేతర ప్రాంతాల్లో తెలుగుభాష వికాసం చెందడానికి ఎందరో తెలుగు భాషాభిమానులు వారి స్థాయిలో తోడ్పడడమేనని తెలిపారు. మాతృభూమి, మాతృమూర్తి, మాతృభాషల్లో మన మూలాలు దాగి వుంటాయని, వాటిని పరిరక్షించుకుంటేనే వైవిధ్యమైన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం అన్నీ నిక్షిప్తం అవుతాయన్నారు. అలాగే భారతదేశం భిన్న భాషలకు నిలయమని, ఆయా భాషలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ఆముక్తమాల్యద, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఎస్.ఎలిజబెత్ జయకుమారి, ఎల్‌బీ సుజాత, ఆచార్య ఎల్‌బీ శంకరరావు, డాక్టర్ పాండురంగం కాళియప్ప, డాక్టర్ మాదా శంకరబాబు, నాగేశ్వరరావు, పట్టాభి తదితరులు పాల్గొని మాతృభాష ఔన్నత్యాన్ని, నేటి సమాజంలో మాతృభాష ఎదుర్కొంటున్న సమస్యలను, మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు.

ట్రెక్కింగ్‌కు నిషేధం



పెరంబూర్, ఫిబ్రవరి 21: రాష్ట్రవ్యాప్తంగా అటవీశాఖ పర్యవేక్షణలోని 30 కొండ ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌కు అనుమతులున్నాయి. ఈ నేపథ్యంలో, 2018లో తేని జిల్లా కురంగిణి కొండ ఎక్కే శిక్షణ పొందుతున్న 20 మంది అడవిలో తలెత్తిన అగ్నిప్రమాదంలో చిక్కుకొని మృతిచెందారు. దీంతో, వేసవిలో ట్రెక్కింగ్‌కు అటవీ శాఖ నిషేధం విధించింది. ప్రస్తుతం ఎండా కాలం ప్రారంభం కానున్నా నేపథ్యంలో, ట్రెక్కింగ్ శిక్షణకు తగిన భద్రత కల్పించలేని పరిస్థితి నెలకొంది. అందువల్ల, తిరుపత్తూర్ జిల్లా ఏలగిరి, వేలూరు జిల్లా అమర్తి, ఓడుగత్తూర్, మేల్‌అరసంపట్టు, తీర్థగిరి, రాణిపేట జిల్లా అమ్మూర్ తదితర ఆరు కొండమార్గాల్లో ట్రెక్కింగ్ వెళ్లడంపై అటవీశాఖ నిషేధం విధించింది.

జూన్ 23 నుంచి ఆగస్టు 10 వరకు

సర్కార్ ఎక్స్‌ప్రెస్ రద్దు

పెరంబూర్, ఫిబ్రవరి 21: ఆంధ్ర రాష్ట్రం నిడదవోలు - కడియం మార్గంలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా చెంగల్పట్టు - కాకినాడ పోర్ట్ - చెంగల్పట్టు రైళ్లు జూన్ 23 నుంచి ఆగస్టు 10వ తేది వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రకారం, నెం.17643 చెంగల్పట్టు - కాకినాడ పోర్ట్ సర్కార్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23 నుంచి ఆగస్టు 10వ తేది వరకు, మరోమార్గంలో నెం.17644 కాకినాడ పోర్ట్ - చెంగల్పట్టు సర్కార్ ఎక్స్‌ప్రెస్ జూన్ 24 నుంచి ఆగస్టు 11వ తేది వరకు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

త్రిషకు అండగా ఖుష్బూ

అడయార్, ఫిబ్రవరి 21: పురుషులను ఈ లోకంలోకి తీసుకొచ్చిన మహిళల పట్ల వారు అహంకారంతో నడుచుకుంటున్నారని సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అభిప్రాయపడ్డారు. హీరోయిన్ త్రిషను ఉద్దేశించి అన్నాడీఎంకే మాజీ నేత ఏవీ రాజు చేసిన అనుచిత వ్యాఖ్యాలు పెను దుమారాన్నే రేపాయి. వీటిని చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులతో పాటు ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కే సెల్వమణి, నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తీ ముక్తకంఠంతో ఖండించారు. అదేవిధంగా ఖుష్బూ కూడా తన ఎక్స్ ఖాతాలో స్పందించారు. ఇలాంటి వ్యాఖ్యలు పురుషుల పెంపకాన్ని తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఆ వ్యక్తి కంటే మీరు ఎంతో బలవంతురాలు. మీ ప్రయాణంలో అంతే బలంతో, నమ్మకంతో ముందుకుసాగాలని కోరుతున్నాను. ఇలాంటి పురుషులు మహిళల పట్ల అమర్యాదగా నడుచుకుంటారు. ఒక మహిళకు పుట్టిన ఏ ఒక్క పురుషుడూ ఇలాంటి వ్యాఖ్యలు చేయరని ఖుష్బూ పేర్కొన్నారు.


జీసీసీ బడ్జెట్ దాఖలు చేసిన సందర్భంగా చెన్నై సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న జీసీసీ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, జీసీసీ కమిషనర్ జె.రాధాకృష్ణన్ తదితరులు


చెన్నై సచివాయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 'తమిళనాడు రాష్ట్ర మహిళా విధానం 2024' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ (చిత్రంలో) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ తదితరులు


చెన్నై చింతాద్రిపేటలో రూ.17 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ అతిథి గృహాన్ని బుధవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ (చిత్రంలో) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా, ప్రజాపనుల శాఖ కార్యదర్శి కె.నందకుమార్, ప్రజాపనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి పద్మజ తదితరులు

తిరుమలలో అదుపుతప్పిన ట్రాక్టర్

ఇద్దరు తమిళ భక్తులకు గాయాలు

తిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం ఓ ట్రాక్టర్ అదుపుతప్పి గేటును ఢీకొన్న క్రమంలో ఇద్దరు తమిళనాడు భక్తులు గాయపడ్డారు. తిరుమలలో భవన నిర్మాణానికి సంబంధించిన ఓ ట్రాక్టర్ షాపింగ్ కాంప్లెక్స్ వైపుగా వచ్చింది. డ్రైవర్ బ్రేక్‌కు బదులు ఎక్స్‌లేటర్ తొక్కడంతో ట్రాక్టర్ అదుపుతప్పి మూసి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ గేటును, పక్కనే నిలబడి ఉన్న ఇద్దరు భక్తులను ఢీకొట్టింది. భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

పుదుచ్చేరిలో త్రిముఖ పోటీ!

పుదుచ్చేరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి పార్లమెంట్ సీటును కైవసం చేసుకునేందుకు మూడు పార్టీల సారథ్యంలో త్రిముఖ పోటీ ఏర్పడనుంది. ఇందులో కాంగ్రెస్, అన్నాడీఎంకే, భారతీయ జనతా పార్టీ సారథ్యంలో ఈ మూడు కూటములు ఏర్పడే అవకాశం ఉంది. అయితే, అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పడే కూటమి వల్ల ఒక కూటమికి సానుకూలంగా మారే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఎన్డీయే కూటమి నుంచి అన్నాడీఎంకే వైదొగలడం వల్ల ఆ కూటమికి చెందిన ఓట్లను చీల్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును మాత్రమే అన్నాడీఎంకే అభ్యర్థికి వస్తాయని, ఎన్డీయే కూటమి ఓట్లు మాత్రం చెక్కుచెదరని బీజేపీ నేతలు అంటున్నారు. అయితే, గత 2014లో జరిగిన ఎన్నికల్లో తాము పొందిన ఓట్ల కంటే అధిక మొత్తంలో ఓట్లు పొంది తమ బలాన్ని నిరూపించుకుంటామని అన్నాడీఎంకే నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అలాగే, తమతమ అభ్యర్థుల గెలుపై అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కూటమి నేతలు మాత్రం గట్టి నమ్మకంతో ఉన్నారు.

లంకకు బీడి ఆకు తరలిస్తున్న జాలర్ల అరెస్ట్


పడవ సహా స్వాధీనం చేసుకున్న బీడీ ఆకు మూటలు

పెరంబూర్, ఫిబ్రవరి 21: శ్రీలంకకు పడవలో 2 టన్నుల బీడి ఆకును తరలిస్తున్న ఐదుగురు రాష్ట్ర జాలర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుకుడి జిల్లా నుంచి శ్రీలంకకు బీడి ఆకులు, గంజాయి, సముద్ర జీవులు, మాదకద్రవ్యాలు అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులున్నాయి. దీంతో, సముద్ర భద్రతా దళం పోలీసులు, కోస్ట్‌గార్డ్ సిబ్బంది, ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ ప్రాంతంలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో, తిరునల్వేలి జిల్లా కూత్తంగుళం నుంచి నాటు పడవలో తూత్తుకుడి సిలువైపట్టి సునామీ క్వార్టర్స్‌కు చెందిన డిజో, మరియ ఆంథోని నరేష్, ముగ్గురు బాలురు నాటు పడవలో శ్రీలంకకు బీడి ఆకు తరలిస్తున్నట్లు గుర్తించి, పడవ సహా 2 టన్నుల బీడి ఆకు స్వాధీనం చేసుకున్నారు.

క్రెడిట్ కార్డు ద్వారా

బస్సు చార్జీల చెల్లింపు

అడయార్, ఫిబ్రవరి 21: చెన్నై నగరంలోని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సుల్లో ప్రయాణ చార్జీలను త్వరలోనే క్రెడిట్ కార్డులు, యూపీఐ, డెబిట్ కార్డు, నేషనల్ మొబిలిటీ కార్డుల్లో కూడా చెల్లించే విధానాన్ని ప్రవేశపెట్టన్నారు. ఇదే విషయంపై ఎంటీసీ అధికారి ఒకరు మాట్లాడుతూ, ఇప్పటికే డెబిట్, క్రెడిట్, యూపీఐ, నేషనల్ మొబిలిటీ కార్డులతో సిటీ బస్సుల్లో ప్రయాణ చార్జీలను ప్రయోగాత్మకంగా చెల్లించే విధానం అమలు చేయగా, అది విజయవంతమైందన్నారు. ఈ విధానాన్ని త్వరలోనే నగరంలోని అన్ని రూట్లలో ప్రవేశపెట్టనున్నట్టు ఆయన తెలిపారు.

రైతుల గోడు పట్టించుకోని కేంద్రం

ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్

ప్యారీస్, ఫిబ్రవరి 21: న్యాయమైన కోర్కెలు పరిష్కరింపజేయాలని కోరుతూ దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రైతులు గోడును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని మక్కల్ నీది మయ్యం కట్చి అధ్యక్షుడు, నటుడు కమలహాసన్ మండిపడ్డారు. స్థానిక ఆళ్వార్‌పేటలో ఆ పార్టీ 7వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమల్ మాట్లాడుతూ... ధనబలం, మీడియా మద్దతు, రాజకీయాల్లో ఎలాంటి అనుభవం లేకుండా స్థాపించిన తమ పార్టీ తక్కువ వ్యవధిలో రెండు ఎన్నికలు ఎదుర్కొని ప్రజలను ఆకట్టుకొనేలా ఓటు బ్యాంక్ రాబట్టుకుందన్నారు. తన సంపాదనతో పార్టీ నడుపుతున్నానని, అందువల్లే సినిమాల్లో నటించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. రైతులకు తమిళనాడు ప్రభుత్వం చేసిన మేలులో 10 శాతం కూడా కేంద్రప్రభుత్వం చేయలేదని, ఢిల్లీలో ఆందోళన చేపట్టిన రైతులను అడ్డుకొనేలా పోలీసు యంత్రాంగాన్ని కేంద్రం వినియోగించుకుంటోందని, ఇలాంటి పాలకులు కూడా అధికారంలో ఉన్నారని ఆయన విమర్శించారు.

అంతరాయం లేకుండా

తాగునీటి సరఫరా

మంత్రి కేఎన్ నెహ్రూ వెల్లడి

అడయార్, ఫిబ్రవరి 21: నగరంలో వేసవి కాలంలో ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేస్తామని రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. ఇదే విషయంపై ఆయన బుధవారం శాసనసభలో ఎమ్మెల్యే వేల్‌మురుగన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ... వలసరవాక్కంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. చెన్నై నగరానికి తాగునీటిని సరఫరా చేసే చోళవరం, పూండి, పుళల్, చెంబరంబాక్కం, తేర్వాయ్‌కండ్రికలలో తగినంత నీరు నిల్వ ఉందని, అందువల్ల నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేస్తామని ఆయన వెల్లడించారు.

అయ్యా... మా సమస్య పరిష్కరించండి

- మంత్రిని కోరిన మరో మంత్రి

పెరంబూర్, ఫిబ్రవరి 21: శాసనసభ సమావేశాల్లో బుధవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో తమ శాఖకు సంబంధించిన ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, తన నియోజకవర్గంలోని సమస్య పరిష్కరించాలంటూ మరో మంత్రి ఏవీ వేలును విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడుతూ.. తిరుచ్చి జిల్లా దువాంకుడి నుంచి విమానాశ్రయానికి వెళ్లే రోడ్డులో జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో టోల్ గేట్ ఏర్పాటు చేశారన్నారు. అక్కడ వసూలు చేస్తున్న టోల్ రుసుముకు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీ వారు ఆందోళన చేపట్టారని తెలిపారు. ఆందోళన ఎవరూ చేసినా, ఆ నియోజకవర్గం తనదని, మా నియోజకవర్గ ప్రజల కోసం టోల్ రుసుము వసూలు నిలిపివేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి ఏవీ వేలు స్పందిస్తూ... జాతీయ రహదారుల శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

దిక్సూచి DIKSUCHI

ఐఐటీ హైదరాబాద్‌లో స్యూర్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఎక్స్‌ప్లోజర్(స్యూర్)' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి కనిష్ఠంగా ఒక నెల, గరిష్ఠంగా రెండు నెలలు ఉంటుంది. అభ్యర్థులు ఫుల్ టైమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్/ఆన్‌లైన్ విధానాలు లేవు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లను అమ్మాయిలకు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా ఉచితం. స్టయిపెండ్ కూడా ఇస్తారు. ఎంపికైనవారికి ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారు. అభ్యర్థులు మెస్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బేసిక్ మెడికల్ సర్వీస్ అందిస్తారు.

విభాగాలు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సస్టయినబిలిటీ, క్లయిమేట్ ఛేంజ్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్, ఫిజిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన పరిశోధనాంశాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత

ఎమ్మెస్సీ(మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ)/ఎంఏ మొదటి ఏడాది చదువుతున్నవారు; బీటెక్(అన్ని విభాగాలు)/బీడిజైన్‌కు సంబంధించి రెండో ఏడాది/మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి మూడో ఏడాది/నాలుగో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో అభ్యర్థులు నిర్దేశిత సీజీపీఏ స్కోర్‌లో టాప్ 20 శాతం సాధించి ఉండాలి. ఫుల్ టైమ్/రెగ్యులర్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌నకు అనర్హులుగా ప్రకటించారు.

ఎంపిక

ప్రిలిమినరీ స్ర్కీనింగ్ ద్వారా సెలెక్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.



స్టయిపెండ్

అభ్యర్థులు ఒక నెల, నెలన్నర, రెండు నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. నెల ప్రోగ్రామ్‌నకు రూ.7,500; నెలన్నర ప్రోగ్రామ్‌నకు రూ.10,000; రెండు నెలల ప్రోగ్రామ్‌నకు రూ.15,000లను స్టయిపెండ్ కింద చెల్లిస్తారు.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** 2024 మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** iith.ac.in, https://iith.ac.in/research/SURE/

ఏపీ పాలిసెట్



ఆంధ్రప్రదేశ్-మంగళగిరిలోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- 'పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు

మూడేళ్ల కోర్సులు: సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3డీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్కింగ్, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అప్పారెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.

మూడున్నరేళ్ల కోర్సులు: బయో మెడికల్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్/షుగర్ టెక్నాలజీ), సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ పాలిసెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఏపీ స్టేట్ బోర్డు రూపొందించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్‌ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **ఏపీ పాలిసెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 27
- **ఫలితాలు విడుదల:** మే 13
- **వెబ్‌సైట్:** polycetap.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2N5NZ6nలో చదవండి.




సన్నిహితుల సమక్షంలో రకుల్ వివాహం



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల మిత్రుడు, నిర్మాత జాకీ భగ్నానీతో ఆమె వివాహం గోవాలోని ఐటీసీ గ్రాండ్ రిసార్ట్స్‌లో బుధవారం జరిగింది. ఉదయం సిఖ్ పద్ధతి ప్రకారం, సాయంత్రం సింధి సంప్రదాయ పద్ధతిలో జరిగిన వీరి వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్‌కుమార్, వరుణ్ ధావన్, జెనీలియా, టైగర్ ష్రాఫ్, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా తదితరులు హాజరయ్యారు.

'బినాకా గీత్ మాలా' అమీన్ సయానీ ఇక లేరు!



'బెహనో ఔర్ భాయియో' అంటూ 42 ఏళ్ల పాటు సిలోన్ రేడియోలో, ఆ తర్వాత వివిధ భారతిలోనూ 'బినాకా గీత్ మాలా' కార్యక్రమంతో హిందీ సినీ గీతాల మాలతో శ్రోతలను అలరించిన స్వరం మూగబోయింది. రేడియో అనౌన్సర్లకు, జాకీలకు పితామహుడు లాంటి అమీన్ సయానీ తన 91 ఏట గుండెపోటుతో బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన సమర్పించే 'బినాకా గీత్ మాలా' వినడం కోసం ఆ రోజుల్లో ప్రతి బుధవారం అంతా రేడియో ముందు చేరిపోయేవారు. ఈ కార్యక్రమంలో ప్రసారం చేసే పాట గురించి మధ్య మధ్యలో ఆయన చేసే వివరణ చాలా ఆసక్తికరంగా ఉండేది. 'బినాకా గీత్ మాలా' మాత్రమే కాకుండా క్విజ్ ప్రోగ్రామ్, షాలీమార్ సూపర్ జోడీ, 'సంగీత్ కే సితారే' వంటి కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. 54 వేల రేడియో కార్యక్రమాలు నిర్వహించిన రికార్డ్ సృష్టించిన అమీన్ సయానీ 2009లో పద్మశ్రీ పురస్కారం పొందారు. ఇప్పటివరకూ పద్మశ్రీ పురస్కారం పొందిన రేడియో అనౌన్సర్ అమీన్ సయానీ మాత్రమే. అలాగే 'భూత్ బంగ్లా', 'బాక్సర్, 'ఖతాల్' వంటి చిత్రాల్లో అమీన్ నటించి, అనౌన్సర్ పాత్రలనే పోషించడం విశేషం.

వేడుకగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డుల ప్రదానం



భారతీయ సినీరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 మంగళవారం రాత్రి ముంబైలో కన్నుల పండుగగా జరిగింది. పలువురు సినీతారలు ఈ చిత్రోత్సవంలో సందడి చేశారు. 'యానిమల్' చిత్రానికి గాను సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ నటీనటులుగా 'జవాన్' చిత్రానికి షారుఖ్, నయనతార అవార్డు స్వీకరించారు. ఉత్తమ ప్రతినాయకుడిగా బాబీడియోల్, ఉత్తమ సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ నిలిచారు. సంగీత ప్రపంచానికి అందించిన సేవలకు గాను యేసుదాస్ ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షారుఖ్‌ఖాన్ మాట్లాడుతూ 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అంటే నాకు చాలా గౌరవం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఉత్తమ నటుడి పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవార్డును నాతో పాటు పురస్కారాలకు నామినేట్ అయిన తోటి నటీనటులకు అంకితమిస్తున్నాను. ఇంత గొప్ప గౌరవం దక్కేలా చేసినందుకు ప్రేక్షకులకూ, జవాన్ చిత్రబృందానికి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

సూర్య కెరీర్‌లోనే హై బడ్జెట్ ఫిల్మ్



విభిన్న పాత్రలను పోషించడంలో ఎప్పుడూ ముందుండే తమిళ హీరో సూర్య ప్రస్తుతం పాన్ వరల్డ్ ఫిల్మ్ 'కంగువ'లో నటిస్తున్నారు. మొత్తం పది భాషల్లో విడుదల కానున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌కు శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దిశా పటాని కథానాయిక. ఈ సినిమా డబ్బింగ్ వర్క్ ప్రారంభించారు సూర్య. ఆయన కెరీర్‌లోని హై బడ్జెట్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. త్రీడీలోనూ 'కంగువ' విడుదల కానుంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EsKRWQ0 లో చదవండి.